క్లుప్తంగా

గుచ్చిమిలో బంగారమ్మ గుడి ప్రతిష్ఠ



బంగారమ్మగుడి వద్ద ప్రారంభమైన పూజలు

సీతానగరం: మండలంలోని గుచ్చిమిలో నిర్మించిన బంగారమ్మ పేరంటాలు గుడి ప్రతిష్ఠ ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు గుడి నిర్వాహకుడు, అర్చకుడు కర్రి వెంకటరమణ మాట్లాడుతూ మా ఇలవేల్పు బంగారమ్మ పేరంటాలు గుడి నిర్మించాలని సంకల్పించి నిర్దేశించిన గడువులోగా పూర్తిచేసినట్లు తెలియజేశారు. వేదపండితుల సూచన మేరకు పేరంటాలు గుడి ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభించామని, ఉత్సవాల్లో రెండవరోజు గురువారం యాగం నిర్వహించనున్నామన్నారు. యాగంలో పాల్గొనే వారితో పాటు వేలాది మంది భక్తులకు అన్న సంతర్పణ ఏర్పాటు చేస్తామని చెప్పారు. భక్తులంతా పాల్గొని పేరంటాలు తీర్ధ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పార్వతీపురం: పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో గురువారం విజయనగరం పుష్పగిరి ఆస్పత్రి వైద్యులు ఉచిత కంటి వైద్య పరీక్షలు చేస్తారని పింఛన్ దారుల సంఘం ప్రెసిడెంట్ జి.జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్ దారులు, ఈహెచ్ఎస్ కార్డుదారులు, ఇతరులు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు తీసుకుని రావాలని సూచించారు. అలాగే గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రాంగణంలో పతాక ఆవిష్కరణ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

సాలూరు: మున్సిపాలిటీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మున్సిపాలిటీ హౌసింగ్ ప్రత్యేకాధికారి, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ ఆదేశించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో హౌసింగ్ ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపాలిటీలో 2,185 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 413 నిర్మాణాలు మాత్రమే ప్రారంభమయ్యాయన్నారు. గుమడాం 4,5 లే అవుట్‌ల వద్ద 1600కు గాను 75 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమైనట్లు తెలిపారు. మిగిలిన లబ్ధిదారులను చైతన్యపరచి నిర్మాణాలు త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే శ్లాబ్‌లు పూర్తయిన ఇళ్లల్లో గృహ ప్రవేశాలు జరిగేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిదేనన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శంకరరావు, పలువురు అధికారులు ఉన్నారు.

వరిగడ్డి కుప్ప దగ్ధం

మక్కువ: మండలంలోని తూరుమామిడి గ్రామానికి చెందిన మత్స సత్యనారాయణ అనే రైతుకు చెందిన వరి గడ్డికుప్ప బుధవారం దగ్ధమైంది. కళ్లంలో సుమారు 100 వరి గడ్డికుప్పలు, దాదాపు 400 ధాన్యం బస్తాలు ఉంచారు. ప్రమాదవశాత్తూ జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డికుప్పకు మంటలు అంటుకోవడంతో, స్థానికులు సాలూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పేయడంతో భారీ నష్టం తప్పింది.

పనులకు హాజరుకాకుంటే జాబ్‌కార్డు రద్దు



ఉపాధి సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: జాబ్‌కార్డు పొందినవారు ఉపాధి పనులకు హాజరుకాకుంటే వారి గుర్తింపు కార్డును రద్దు చేస్తామని ఎంపీడీఓ డొంక త్రినాథులు స్పష్టం చేశారు. ఉపాధి అధికారులు, క్షేత్ర సహాయకులతో బుధవారం సమావేశమయ్యారు. ఉపాధి సిబ్బంది, వేతనదారులు సకాలంలో పనులకు హాజరుకావాలని, పని ప్రదేశంలో క్షేత్రసహాయకులు కచ్చితంగా ఉండాలన్నారు. వేతనదారులకు పనిముట్లు, కనీస సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టాలన్నారు. వేతనదారులను బృందాలుగా విభజించి పనులు ఇవ్వటం ద్వారా సకాలంలో లక్ష్యాలు చేరుకోవచ్చన్నారు. సమావేశంలో ఉపాధి ఏపీఓ ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

జియ్యమ్మవలస: మండలంలోని తురకనాయుడువలసలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఎంపీడీఓ ఎస్.రమేష్ బుధవారం పరిశీలించారు. కెనాల్ అభివృద్ధి పనులు పరిశీలించి వేతనదారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రూ.257 వరకు వేతనం వస్తుందన్నారు. పనులను పర్యవేక్షించాలని, పారదర్శకంగా మస్తర్లు నమోదు చేయాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. అవకతవకలకు పాల్పడే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు.

సంక్షేమపాలన అందిస్తున్న ఏకైక ప్రభుత్వం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమపాలన అందిస్తున్న ఏకైక ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల పక్షాన నిలుస్తున్నారన్నారు. పార్వతీపురం మండలంలోని పుట్టూరు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే జోగారావు గ్రామంలో విస్తృతంగా పర్యటించి గడపగడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. అమ్మ ఒడి వచ్చిందా? రైతు భరోసా వచ్చిందా? పింఛన్ ఇంటివద్దకే వచ్చి ఇస్తున్నారా? అంటూ ఆరా తీశారు. సంక్షేమ పథకాల అమలు తీరును వివరించిన ఎమ్మెల్యే జోగారావు లబ్ధిదారులకు ఏదైనా అన్యాయం జరుగుతోందా? అనే విషయాన్ని తెలుసుకునేందుకే వచ్చామని వివరించారు. సంక్షేమ పథకాల అమలులో లబ్ధిదారులు సంతృప్తి చెందడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో అందిస్తోందని తెలిపారు. సచివాలయానికి రూ.20లక్షల నిధులను ప్రభుత్వం కేటాయించిందని, వాటి ద్వారా పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పించనున్నట్లు తెలిపారు.

అర్థం లేని వాఖ్యలు చేస్తున్న ప్రతిపక్షం

ప్రతి కుటుంబానికి ఏదోఒక సంక్షేమ పథకం అందజేస్తూ పేదల అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తున్న తీరును ఓర్వలేక టీడీపీ, జనసేన నాయకులు కొందరు అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. వలంటీర్లపై బురద చల్లడం సరికాదని, వలంటీర్లు చేస్తున్న సేవలు ఎనలేనివని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ సిద్ధా జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు స్టేట్‌కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం చేపట్టాలి

- ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి

సీతానగరం: ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలన్న సంకల్పంతో ప్రభుత్వం గ్రామాల్లో జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి మంజూరుచేసిన స్థలాల్లో ఇళ్లనిర్మాణం వేగవంతం చేయాలని ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలోని రెడ్డివానివలస, రామవరం, ఆర్.వెంకంపేట గ్రామాల్లోని జగనన్న లేఅవుట్లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రామవరంలో సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారులతో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో కోట్లాది రూపాయల విలువైన భూములను సమకూర్చి ప్రభుత్వం జగనన్న లేఅవుట్లను వేసిందని అందులో అర్హులైన వారందరికీ పక్కా ఇళ్లు మంజూరుచేసిందన్నారు.ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన నీరు వసతి, రహదారి, విద్యుత్ సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. జగనన్న ప్రభుత్వం ఇన్ని సౌకర్యాలు కల్పించినప్పటికీ కొంతమంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం ఎందుకు చేపట్టలేదో ఆరా తీశారు. స్థలాలు సమకూర్చి ఇళ్లు మంజూరుచేసినప్పటికీ ఆర్థిక ఇబ్బందులుంటే లబ్ధిదారులు తమదృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ పరంగా వెలుగు ద్వారా నామమాత్రమైన వడ్డీపై రుణసదుపాయం కల్పిస్తామని చెప్పారు. అనంతరం ఆర్ వెంకంపేట సచివాలయాన్ని సందర్శించి ఉద్యోగుల హాజరుపట్టీని తనిఖీ చేసి ,గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. తరువాత పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు, వెల్ఫేర్ సహాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి

గరుగుబిల్లి: ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెట్టాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండల కేంద్రంలోని హిక్కింవలస ప్రాథమిక జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను బుధవారం పరిశీలించారు. సరుకుల నిల్వలు, భోజనాల నాణ్యతను పరిశీలించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



తిరువీధిలో పాల్గొన్న గ్రామస్తులు

పాలకొండ రూరల్: మండలంలో అంపిలి గ్రామంలోని రామమందిరంలో సీతారాముల విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. కోటదుర్గమ్మ దేవస్థానం ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ నేతృత్వంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు ముర్రాటలు పట్టుకుని ఊరేగింపుగా వచ్చి స్వామివారికి సమర్పించారు. విగ్రహాల ప్రతిష్ట సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

నిర్మాణాలు వేగవంతం చేయాలి

పాలకొండ రూరల్: జగనన్న కాలనీలో లబ్ధిదారులచే గృహ నిర్మాణాలు చురుగ్గా జరిపించేలా అధికారులు కృషిచేయాలని సీతంపేట ఐటీడీఏ పీఓ బి.నవ్య అన్నారు. బుధవారం పాలకొండ వచ్చిన ఆమె నగర కమిషనర్ సామంచి సర్వేశ్వరరావుతో కలిసి పట్టణంలోని పలు వార్డు సచివాలయాలను సందర్శించారు. పారిశుద్ధ్య నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగం నిషేధంపై అక్కడి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ మేరకు ప్రజలను చైతన్యపర్చాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయాల్లో రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలపై ఆరా తీశారు.

భారీగా సారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సారా నిల్వలతో ఎస్ఈబీ అధికారులు

పాలకొండ రూరల్: పట్టణంలోని రెల్లివీధిలో ఎస్ఈబీ అధికారులు బుధవారం చేపట్టిన తనిఖీల్లో భారీగా సారా నిల్వలు గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్ఈబీ సీఐ ఎంవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ సీతంపేట మండలం నారాయణగూడ నుంచి 350 లీటర్ల సారాను పాలకొండ పట్టణంలోకి తీసుకొచ్చినట్లు సమాచారం అందడంతో తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. నారాయణగూడకు చెందిన ముగ్గురు వ్యక్తులతో పాటు రెల్లివీధికి చెందిన ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సారా తయారీ, రవాణా చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తరహా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారం అధికారులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

సమస్యల పరిష్కారానికే ‘గడప గడపకు’

- అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం



అంబేద్కర్ విగ్రహానికి పాదాభివందనం చేస్తున్న మంత్రి రాజన్నదొర

మెంటాడ: సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తుందని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని పెదచామాలాపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సంక్షేమానికి చిరునామాగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందన్నారు. జగనన్న పేదల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా భావించి నవరత్నాలతో పాటు పలు పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పేదల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ

అంబేద్కర్ ఎంతో మందికి ఆదర్శప్రాయుడని, ఆయన రాసిన రాజ్యాంగం వల్లే నేడు ఎంతో మంది దళిత, గిరిజన కుటుంబాల్లో ఉన్నవారు ఉన్నత స్థాయిలో అందలాలు ఎక్కారన్నారు. పెదచామాలాపల్లి గ్రామంలోని గడప గడపకు కార్యక్రమంలో ముందుగా అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం పూలమాల వేసి పాదాలకు అభివందనం చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ రోజు తాను ఉప ముఖ్యమంత్రి అయ్యానంటే దానికి గల కారణం అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో దళితులకు ఇచ్చిన ప్రాధాన్యత వల్లేనన్నారు. గ్రామ సర్పంచ్ భాయి తవుడుమ్మ, స్థానిక నాయకులు భాయి అప్పారావు, జిల్లా దళిత నాయకులు బసవ సూర్యనారాయణ, మండల పార్టీ నాయకులు లెంక రత్నాకర్, వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు, పొట్టంగి అచ్చుత్, రెడ్డి రాజప్పలనాయుడు, చెల్లూరి లక్ష్మణరావు, కిలపర్తి మధు, మోహన్, ఎంపీడీఓ తివిక్రమ్, తహసీల్దార్ ఆదిబాబుతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన



సరుగుడుగూడలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కొమరాడ:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని ఉలిపిరి, అల్లువాడ, రామభద్రపురం, సరుగూడ తదితర గ్రామాల్లో బుధవారం ‘గడపగడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ప్రతీ గడపలో మహిళలు ఎమ్మెల్యేకు హారతులు పట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, మన రాష్ట్రంలో అమలవుతున్నన్ని పథకాలు మరే రాష్ట్రంలోనూ అమలు కావడం లేదన్నారు. సంక్షేమ పాలనలో ఆంధ్ర ప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ వారి గడప వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని అన్నారు. ఇళ్లులేని పేదలకు ఇళ్ల స్థలాలు, గిరిజనులకు పోడు పట్టాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు, విద్యుత్ శాఖ జేఈ వెంకటరమణ, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బావుజీనాయుడు, ఎంపీపీ శెట్టి శ్యామల, జడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, మండల కన్వీనర్ డి.జనార్దనరావు, వైస్ ఎంపీపీలు నంగిరెడ్డి శరత్‌బాబు, కేంద్రక అన్నపూర్ణ, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు కళింగి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవం



ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ రేణుక



సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: రాజ్యాంగ బద్ధంగా కల్పించిన ఓటు హక్కు ద్వారా నిజాయితీగా పాలించే నాయకులను ఎన్నుకోవాలని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బొబ్బిలి రేణుక అన్నారు. జాతీయ ఓటర్ల దినోవాన్ని పురస్కరించుకుని గురువారం కాలేజీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా ఓటుహక్కు పొందిన విద్యార్థులంతా ఓటు హక్కును నిర్భయంగా వినియోగించు కోవాలని కోరారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని ఓటుహక్కు వినియోగంలో భాగంగా కొత్తగా ఓటుహక్కుపొందిన వారితో నిజాయితీగా ఓటు వేసేందుకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు డి.రామకృష్ణ, టి. రవికుమార్, అధ్యాపకుడు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ ఓటర్లకు సత్కారం

జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ ఓటర్లు ఆర్‌వీ పార్థసారథి, ఎస్ హరిగోపాలరావుతో పాటు కొత్తగా ఓటుహక్కు పొందిన వారిని తహసీల్దార్ ఎన్వీ రమణ సత్కరించారు. అనంతరం ఓటుహక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌లు షేక్ ఇబ్రహీం, చిట్టెమ్మ, రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సగటు వేతనం గిట్టుబాటయ్యేలా చూడాలి



మాట్లాడుతున్న డ్వామా ఏపీడీ శ్రీహరి

సీతానగరం: మండలంలోని ఉపాధి వేతనదారులకు సగటు వేతనం గిట్టుబాటయ్యేలా 90 రోజులు పనికల్పించి బిల్లులు వేగవంతం చేయాలని ఉపాధి హామీ పథకం ఏపీడీ శ్రీహరి అన్నారు. ఈ మేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బి. కృష్ణమహేష్‌రెడ్డి అధ్యక్షతన ఉపాధిహామీ అధికారులు, క్షేత్ర సహాయకులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏపీడీ శ్రీహరి మాట్లాడుతూ గ్రామాల్లో వేతనదారులందరికీ ఉపాధిహామీ పనులు కల్పించి వేతనం రూ.250 ఇవ్వాలని ప్రభుత్వం నిర్ధారించినప్పటికీ సగటు వేతనంగా రూ.230కి తగ్గకుండా పని కల్పించాలని కోరారు. అలాగే వేతనదారులు సమయపాలన పాటించి రెండుపూటలా పని చేయాలని, వేతనదారులకు ఫోన్‌ద్వారా హాజరువేసి ఆన్‌లైన్‌ద్వారా పంపించాలని స్పష్టం చేశారు. ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జానుమల్లువలసలో అమృతసరోవర్ చెరువు గట్టుపై గురువారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీఓ జి.నాగలక్ష్మి, ఐఈ కృష్ణ, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రంగోలి విజేతలకు ప్రశంసలు



విజేతలకు ప్రశంసా పత్రాలను అందిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

గరుగుబిల్లి: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఆవరణలో నిర్వహించిన రంగోలి పోటీల విజేతలకు కలెక్టర్ నిషాంత్‌కుమార్ బుధవారం ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ పోటీల్లో గరుగుబిల్లికి చెందిన వీఓఏలు చింతల ఉష, గొట్టాపు సుజాత, ఉల్లిబద్రకు చెందిన వీఓఏ శ్రీదేవి, కొంకడివరం వీఓఏ పావని, గొట్టివలస వీఓఏ శ్రీదేవి విజేతలుగా నిలిచినట్లు వైకేపీ ఏపీఎం పి.అప్పలనాయుడు తెలిపారు. విజేతలను కలెక్టర్‌తో పాటు డీఆర్‌డీఏ ఏపీడీ వై.సత్యంనాయుడు, పలువురు అధికారులు అభినందించారు.

అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు

- సబ్ కలెక్టర్ నూరల్‌కమర్



పనసనందివాడ ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరల్‌కమర్

వీరఘట్టం: అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని పాలకొండ సబ్‌కలెక్టర్ నూరల్ కమర్ హెచ్చరించారు. మండలంలోని పనస నందివాడ నాగావళి నదీతీరంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నట్లు ఫిర్యాదు రావడంతో బుధవారం ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సబ్ కలెక్టర్ వస్తున్నట్లు సమాచారం తెలియడంతో ఇసుక తవ్వకాలు నిలిపివేశారు. అయితే ఇక్కడ నిత్యం అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు ఆయన గుర్తించారు. రెవెన్యూ, సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఇసుక తవ్వకాలు జరగకుండా చూడాలని సూచించారు. ఇకపై ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణా జరిగుతున్నట్లు ఫిర్యాదులు అందితే సంబంధిత సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వీరఘట్టం మండల కేంద్రంలోని ఓ రేషన్ డిపోను తనిఖీ చేశారు. కార్డుదారులకు సక్రమంగా బియ్యం పంపిణీ చేసేలా చూడాలని తహసీల్దార్ సత్యనారాయణకు సూచించారు.

2.90 లక్షల పనిదినాల కల్పనే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణారావు

భామిని: మండలంలో ఉపాధి వేతనదారులకు మార్చి 31లోగా మరో 2.90 లక్షల పనిదినాలు కల్పించాలని ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. ఏపీఎం జి.తులసీదాస్ అధ్యక్షతన ఉపాధి పనులపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటికే గ్రామాల్లో 3.86 లక్షల పనిదినాలు పూర్తయ్యాయని ఏపీఓ తులసీదాస్ తెలిపారు. వాటికి అదనంగా చేపట్టాల్సిన లక్ష్యాలను సిబ్బందికి వివరించారు. ప్రస్తుతం పనులు చేపడుతున్న గ్రామాలతో పాటు మరిన్ని హేబిటేషన్లలో పనులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఉపాధి టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

వాహనాల వేలం

కురుపాం: మండల పరిధిలో సారా కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఎస్ఈబీ అధికారులు బుధవారం వేలం వేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏడు ద్విచక్ర వాహనాలు, ఒక ట్రాక్టర్(తొట్టితో కలిపి)ను వేలం వేసినట్లు ఎస్సై సీహెచ్ ప్రసాద్ తెలిపారు. వాహనాలు దక్కించుకున్న వారు 18శాతం జీఎస్టీతో కలుపుకొని నగదు చెల్లించాక వాహనాలను వారికి అందజేశారు. ఆయనతో పాటు ఎస్ఈబీ సీఐతో పాటు ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు బోధనపై దృష్టి సారించాలి



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు సూచించారు. మండలంలోని కోటవానివలస పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులకు కృత్యాలతో కూడిన బోధన అందించాలని, వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు.